క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు ప్రారంభం



దుగ్గిరాల: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అజస్ర దీపారాధన, అంకురార్పణ, వాస్తుపూజ, గరుడ కుంభ ఆవాహనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాద వితరణతో తొలిరోజు ఉత్సవాలు ముగిశాయి. అద్దేపల్లి మస్తాన్‌రావు దంపతులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు.. మినిమం స్కేల్స్ ప్రకటించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన 400 మంది ఆపరేటర్లు మంగళగిరి జాతీయ రహదారి పక్కన కల జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,780 మంది ఆపరేటర్లు పనిచేస్తున్నామన్నారు. మినిమం స్కేల్‌తో ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి తమ గోడు చెప్పుకునే వరకు భైఠాయిస్తామన్నారు.

వక్ఫ్ బోర్డు పరిరక్షణ సభను జయప్రదం చేయండి



దుగ్గిరాల: ముర్తుజానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్ఫ్ బోర్డు పరిరక్షణ సభను జయప్రదం చేయాలని సుభానీ కోరారు. విజయవాడ ధర్నా చౌక్‌లో శనివారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు ఆధ్వర్యంలో మహా ధర్నా జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు నూతన చట్ట సవరణ బిల్లు విరమించుకోవాలని, లేని పక్షంలో తమ పూర్వీకులు కూడబెట్టిన మసీదులు, మదర్సాలు, అనాథాశ్రమాలు విలువైన ఆస్తులు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సయ్యద్ యాకోబువలీ, పఠాన్ మస్తాన్‌ఖాన్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం ధర్నాలు



దుగ్గిరాల: సీపీఎం మండల కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు వ్యతిరేకిస్తూ శనివారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు చైతన్య యాత్రలు.. గ్రామాల్లోని సమస్యలను అధ్యాయనం చేసి, పరిష్కరించేందుకు చేపడతామన్నారు. గ్రామ సచివాలయాల్లో ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం వేతనం తగ్గించడాన్ని నిరసిస్తూ సచివాలయాల్లో అర్జీలు ఇస్తామని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, ఎం.యోగేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శుభ్రమైన నీటితో ఆరోగ్యం



ఫిరంగిపురం: వేసవిలో శుభ్రమైన నీటిని తాగడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని బఫర్ వైద్యురాలు అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి బఫర్ వైద్యురాలు షుగర్, బీపీ వంటి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాగర్ రాణి, ఏఎన్ఎం సరోజ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దుకాణాదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రవీంద్రబాబు అన్నారు. ఫిరంగిపురంలో దొంగలు తిరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ శుక్రవారం రిక్షాపై ప్రచారం చేయించారు. ద్విచక్ర వాహనదారులు రాత్రిళ్లు వీల్ తాళాలు వేసుకోవాలని చెప్పారు. పోలీసుల గస్తీ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఎండ.. కావాలి ఒక కుండ

- మార్కెట్‌లో మట్టి కుండలకు గిరాకీ
- సామాన్య, మధ్యతరగతి ఫ్రిజ్‌కు ఆదరణ
- విక్రయాలు చేపడుతున్న వ్యాపారులు



నుదురుపాడులో అమ్ముతున్న కుండలు

ఫిరంగిపురం: ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోంది. జీవనశైలిని మళ్లీ పాత పద్ధతుల వైపు నడిపిస్తున్నారు. ముడి బియ్యం, రాగి, జొన్న సంగటి ఇలా ఆహార పదార్థాల్లోనే కాదు.. తాగు నీటి నిల్వ విషయంలోనూ జాగ్రత్తలు పాటిస్తున్నారు. మధ్య వయస్కుల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాగి పాత్రలతో నీటిని తాగేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక వేసవిలో అందరికీ గుర్తుచ్చేది పాత్ర మట్టి కుండ. ఎండలు తరుముకొస్తున్న తరుణంలో వాటికీ డిమాండ్ పెరుగుతోంది. ఇందుకు తగ్గట్లే రోడ్ల పక్కన గుడారాలు వేసి, వాహనాల్లో ఇళ్ల వద్దకు వ్యాపారులు కుండలను విక్రయిస్తున్నారు.

విరివిగా మట్టి కుండలు

ఇంతకాలం మట్టి కుండ వైపు కన్నెత్తి చూడని వారు కూడా నేడు వీటి కొనుగోలుకు పరుగులు తీస్తున్నారు. ఎంతో ఖరీదైన ఫ్రిజ్ ఇంట్లో ఉన్నా.. నేడు మట్టి కుండలోని నీటిని తాగేందుకు ఇష్టపడుతున్నారు. మట్టితో చేసిన కుండలు పేదవాడి ఫ్రిజ్ అనేది నానుడి. దీనిలో నీటిని పోసి తాగడం వల్ల ఎటువంటి అనర్థాలు ఉండవనే భావన ప్రజల్లో ఉంది.

పెరిగిన కుండల అమ్మకాలు

ఫిరంగిపురం మండల కేంద్రంతో పాటు నుదురుపాడు రైల్వేస్టేషన్, మేరికపూడి, 113 తాళ్లూరు గ్రామాల్లో అనేకమంది మట్టి కుండలు, మట్టి పాత్రలు విక్రయిస్తున్నారు. వీటిని విజయవాడ, మంగళగిరి, కొండవీడు వంటి ప్రదేశాల నుంచి తీసుకొస్తున్నారు. కుండలో ఉంచిన నీటిని తాగడం ద్వారా దప్పిక తీరడంతో పాటు ఆల్కలిన్ లక్షణాలు నీటి పీహెచ్‌స్థాయిని సమతుల్యం చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. చిన్న పాటి కుండ ధర రూ.200 వరకు ఉంది. పెద్దవి రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. ప్రతిరోజు పది నుంచి 15 కుండలు వరకు అమ్ముతున్నామని అమ్మకం దారులు తెలిపారు. నాలుగు నెలల పాటు అమ్మకాలు బాగా ఉంటాయని అంటున్నారు.

కుండ నీటితో ఉపయోగాలు



మట్టికుండలో ఉంచిన నీటితో తాగితే ఎన్నో ఉపయోగాలు. వాటిలో న్యూట్రీషియన్ వ్యాల్యూస్‌ఉంటాయి. దీంతో ఒంట్లో వేడి తగ్గడమేకాకుండా జలుబు, దగ్గు వంటివి దరిచేరవు.

– డాక్టర్ ఫరీనాబేగం

ఐదేళ్లుగా కుండ నీరే



ఇంట్లో ఫ్రిజ్ ఉన్నా వేసవిలో కొత్త కుండ కొనుగోలు చేసి వాడుతుంటాం. గత ఐదేళ్లుగా కుండలో నీటిని తాగుతున్నాం. దాహం తీరడమే కాకుండా ఎటువంటి రోగాలు రావు.

– కె.పేరారెడ్డి, విశ్రాంత పోస్ట్ మాస్టర్

ప్లాస్టిక్ రహిత నగరానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: మంగళగిరిని ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ పేపర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్లు విక్రయించడం గానీ, వినియోగించడం కానీ నిషేధమని పేర్కొన్నారు. ఎవరైనా ఈ నిబంధనలను పాటించకపోతే వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. షాపులకు వచ్చే ప్రజలకు ఇంటికి వచ్చే టప్పుడు వస్త్రంతో, పేపర్‌తో, జ్యూట్‌తో చేసిన సంచులు వెంట తెచ్చుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే ఎంటీఎంసీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు చేపట్టడం జరిగిందని, కార్పొరేషన్, సచివాలయ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

నేడు గాయని సునీత సంగీత కచేరి



వివరాలను వెల్లడిస్తున్న సింగర్ సునీత

మంగళగిరి: ప్రతి ఒక్కరికి చెరగని జ్ఞాపకాలను తమ మనస్సులలో నిలిపేదే సంగీతం అని ప్రముఖ సింగర్ సునీత పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే సంగీత కచ్చేరి గురించి ఆత్మకూరు జాతీయ రహదారి వెంటకల సీకే కన్వెన్షన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ బీఎస్‌పీ గోల్డ్ అండ్ డైమండ్స్ సమర్పణలో కాత్యా అండ్ కౌశిక్ ఎంటర్‌టైన్ మెంట్స్ అనూప్ ఈవెంట్స్ వారి సునీత ఉపద్రష్ట లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు రాత్రి సీకే కన్వెన్షన్‌లె హాలులో మ్యూజిక్ షో నిర్వహించనున్నామని తెలిపారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు షో ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ ప్రాంతానికి వచ్చిన సమయంలో చిన్నప్పుడు విజయవాడ, గుంటూరులలో తాను నేర్చుకున్న సంగీతం, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ గోల్డ్స్, డైమండ్స్ అధినేత పొన్నూరు రామ్‌కుమార్, ఇందుకూరు శ్రీరామ్, డి.జయనరసింహారావు, ప్రజాపతి దీపక్, గుడవల్లి జయప్రకాష్, మెండు అనూప్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జీవో నంబరు 77ను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంగళగిరి టౌన్ : పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబరు 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాజర్‌జీ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాజర్‌జీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పీజీ చదువుతున్న విద్యార్థులకు కామన్ పీజీ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్షను రద్దు చేసి, ఏ యూనివర్సిటీకి చెందిన ప్రవేశ పరీక్షను ఆ యూనివర్సిటీ నిర్వహించే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఈ జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కామన్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థులు తమకు నచ్చిన విశ్వవిద్యాలయాల్లో చేరలేక పోతున్నారన్నారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు వేరే జిల్లాల్లో సీటు వస్తే అక్కడకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే జీవో వల్ల కేవలం ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తింపజేస్తున్నారని, ప్రైవేటు, కార్పొరేటర్ కళాశాలల విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని గుర్తుచేశారు. జీవోను రద్దు చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, కార్యవర్గ సభ్యులు యశ్వంత్, శివ, సాధిక్ బాబు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యక్షులు నాసరయ్య పాల్గొన్నారు.

పవిత్ర మాసంలో శుభాల శుక్రవారం



విద్యుద్దీప కాంతుల్లో పెద్ద బస్టాండ్ వద్ద మసీదు

మంగళగిరి టౌన్ : ముస్లిం సమాజానికి జుమ్మా (శుక్రవారం) పవిత్రమైన రోజు. సూర్యుడు ఉదయించే రోజుల్లో అన్నింటి కంటే ఉత్తమమైన రోజుగా జుమ్మాను పరిగణిస్తారు. ఇస్లాంలో ప్రధానంగా రంజాన్, బక్రీద్ అనే రెండు పండగలు ఉన్నప్పటికీ వారంలో ఒకరోజైన జుమ్మాను ప్రత్యేక పండుగలా పరిగణిస్తారు. రంజాన్ మాసంలో ఇది మరింత విశిష్టతను సంతరించుకుంటుంది. ముఖ్యంగా చివరి జుమ్మా విశేష ఫలప్రదానమైనదిగా భావిస్తారు. ఖురాన్‌లోనూ సూరా 'అల్–జుమ్మా'లో శుక్రవారం విశిష్టత వివరించబడింది. పవిత్ర రంజాన్ మాసంలోని తొలి శుక్రవారం మంగళగిరి నగరంలో మసీదులు కిటకిటలాడాయి. రంజాన్ మాసం తొలి శుక్రవారం కావడంతో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ చేశారు. పలు మసీదులలో ముస్లిం పెద్దలు సందేశం ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఫిరంగిపురం: మండల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాల నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లి రూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 6వ బెటాలియన్, డీజీపీ కార్యాలయం, ఎల్‌బీ నగర్, మెయిన్ బజార్, ఆత్మకూరు బైపాస్ రోడ్డు పడమర వైపు, శ్రీనివాస్ నగర్, శ్రీనగర్ కాలనీ ప్రాంతాలు, నిడమర్రు గ్రామం తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లంపూడి, వడ్డేశ్వరం, గుండిమెడ, ఇప్పటం గ్రామాల్లో 11 కేవీ లైన్ ట్రీ కటింగ్, మరమ్మతుల నిమిత్తం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

బీసీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

దుగ్గిరాల: బీసీ మహిళల అభివృద్ధికి టైలరింగ్ ట్రైనింగ్ ఉంటుందని మండలంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి, అనంతరం ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలం 45, 60, 90 రోజులని, కుట్టు మిషన్ శిక్షణ తీసుకువానే ఆయా పరిధిలోని సచివాలయాల్లో అప్లై చేసుకోవాలని తెలిపారు. వయస్సు 18 నుంచి 50 సంవత్సరాలు కలిగినటువంటి మహిళలు అర్హులుగా నిర్ణయించారు.

కార్మికుల దీక్షకు మద్దతు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు 94వ రోజు శుక్రవారం కొనసాగింది. ప్రభుత్వానికి కార్మికుల గోడు వినిపించడం లేదని యూనియన్ నాయకులు కె. ఆదినారాయణ విమర్శించారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. యూనియన్ నాయకులు సూర్యప్రకాష్, ఆశీర్వాదం, కార్మికులు విజయశ్రీ, దుర్గా భవాని, గురవయ్య, దానయ్య, బాషా, ఇస్మాయిల్, ఇమాంబి, రిబ్కా, డి. రమణ, మల్లేశ్వరి, అంకయ్య పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ వీర పాండ్యన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకట సుబ్బయ్య, ఆశ వర్కర్లు

మంగళగిరి టౌన్ : గత 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏపీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నగరపరిధిలోని ఆటో నగర్‌లో ఉన్న వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఆశ వర్కర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఏఎన్ఎంలు చేయవలసిన విధులను ఆశ వర్కర్లు చేస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఆశ వర్కర్లు అధ్యక్ష కార్యదర్శులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆయా జిల్లా కార్యాలయాల ముందు ధర్నా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్ఎంగా, జీఎస్ఎంగా శిక్షణ పూర్తి చేసుకుని ఆశ వర్కర్లుగా గత 15 ఏళ్లుగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.18 వేలు కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు ఆశ వర్కర్లకు వర్తింపజేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా యూనియన్ గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్, ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకులు చందామణి, రాజ్యలక్ష్మి, మల్లేశ్వరి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైలో ఘనంగా టెక్నికల్ ఫెస్ట్

మేడికొండూరు: మండల పరిధిలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నికల్ ఫెస్ట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అన్ని కళాశాలలకు ఈ టెక్నికల్ ఫెస్ట్ ఆహ్వానం పంపించామని తెలిపారు. సుమారు 35 కళాశాల నుంచి వివిధ క్రీడాకారులు, టెక్నికల్ ఈవెంట్‌లో పాల్గొనడానికి వచ్చినట్లు వెల్లడించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, వారి పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా చేయడమే ఈ టెక్నికల్ ఫెస్ట్ ముఖ్య ఉద్దేశమన్నారు. సుమారుగా రూ.5 లక్షల వరకు ప్రైజ్ మనీ ప్రకటించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్ కు 5వేల వరకు రిజిస్ట్రేషన్స్ చేసుకున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రముఖ పారిశ్రామిక వ్యక్తి శరత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, శ్రీహరి రావు, ఏవో సీతారామయ్య, చంద్రమౌళి రాము, నాగేశ్వరావు, సౌజన్య, కేఎస్ఆర్ రెహమాన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


డ్రోన్‌కి చిక్కి మందుబాబు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు బహిరంగ ప్రదేశంలో పోలీసులు డ్రోన్ గస్తీ శుక్రవారం నిర్వహించారు. మద్యం తాగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు.

10న ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఈ నెల 10న గుంటూరులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి మండల కమిటీ సమావేశం అధ్యక్షుడు మోదుగుల శ్రీనివారెడ్డి అధ్యక్షతన తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జొన్న శివశంకరరావు మాట్లాడుతూ రైతుల స్థిరీకరణ నిధి రూ. 3 వేల కోట్లకు పెంచాలని కోరారు. 2021లో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులకు ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కంది, మినుము తదితర వాణిజ్య పంటలకు ప్రస్తుత కాలంలో ధరలు పతనమై రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధర ఏ విధంగా సరిపోవడం లేదన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, నాయకులు డి.వెంకట్‌రెడ్డి, పల్లె కృష్ణ, చింత శ్రీరామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో చెత్త తొలగింపు



పనులను పర్యవేక్షిస్తున్న డీఈ రాము

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారి ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తను కార్పొరేషన్ అధికారులు శుక్రవారం తొలగించారు. కొన్నేళ్లుగా తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలోని చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడంతో భారీ ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డులను పరిశీలించేందుకు కేంద్ర స్వచ్ఛ భారత్ బృందం రానున్నడడంతో చెత్తను తొలగిస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ సందర్భంగా డీఈ రాము మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో కమిషనర్ అలీమ్‌బాషా పర్యటిస్తున్నారని, ప్రతి ప్రాంతంలోనూ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా డంపింగ్ యార్డులో వున్న వ్యర్థాలను తొలగిస్తున్నామని, తొలగించిన వ్యర్థాలను గుంటూరు శివారు ప్రాంతంలో ఉన్న జిందాల్ తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం

తెనాలిరూరల్: ఆటో డ్రైవర్‌పై పదునైన వస్తువుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి అతడి వద్ద ఉన్న నగదును గుర్తు తెలియని వ్యక్తి దోచుకెళ్లాడు. ఈ ఘటన తెనాలి మండలం కఠెవరం నుండి కోపల్లెకు వెళ్లే మార్గంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణ మారీస్‌పేట సీఎం కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అశోక్‌కుమార్ డ్వాక్రా డబ్బులు కట్టేందుకు సొంత ఆటోలో కఠెవరం నుంచి కోపల్లె వెళుతున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి ఆటోను ఆపగా బాడుగ కోసం అయ్యుంటుందని ఆటోను ఆపాడు. సదరు వ్యక్తి అశోక్‌కుమార్‌పై దాడికి చేయడమే కాకుండా జేబులో నుంచి బ్లేడ్ వంటి పదునైన వస్తువు తీసి గొంతు, చేతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అశోక్ జేబులో ఉన్న రూ.11 వేలు దోచుకెళ్లాడు. గొంతు మీద తీవ్ర గాయంతో షాక్‌కు గురైన బాధితుడు తేరుకున్నాక తన స్నేహితుడికి ఫోన్ చేసి విషయం తెలుపగా, అతని సాయంతో తెనాలి జిల్లా వైద్యశాలలో చేరాడు. రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుడి నుంచి వైద్యశాలలో వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు రాజుల సిలువ మార్గం

దుగ్గిరాల: చిలువూరు గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సిలువ మార్గం రోడ్ల వెంబడీ భక్తి శ్రద్ధలతో ర్యాలీ చేశారు. శ్రమల దినాలలో మొదటి శుక్రవారం రోజున ముగ్గురు రాజు ల దేవాలయ తపస్సు చేశారు. అనంతరం వీధుల్లో మాల వేసుకున్న భక్తులు సిలువను తీసుకుని ఊరేగింపుగా తిరిగారు. అత్యంత భక్తిపరవశంతో నిర్వహించారు. ఉపదేశి బాల, కొండమూది జోజిబాబు, యువకులు పాల్గొన్నారు.